


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే  ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"రాముడు ప్రభవించాలంటే, ముందు రావణుడు పుట్టాలి. ప్రకృతిని హస్తగతం చేసుకుని విధితో (కాలంతో) ఆటలాడుకోవాలి. అలాగే అంతకు మునుపెన్నడో హిరణ్యకశిపుడు వధకోసం ప్రహ్లాదుడు పుట్టాడు. ప్రహ్లాదుడు పుట్టకపోతే నృశింహావతారపు  అవసరమే ఉండేది కాదు గదా! ఈ సృష్టిలో ప్రతిదానికీ ఓ చర్య – ప్రతి చర్య ఉండి తీరుతుంది. సృష్టిపక్కనే ప్రళయం, జననం పక్కనే మరణం, కష్టం పక్కనే సుఖం, వినోదం పక్కనే విషాదం ఇలా ఒకటి పక్కన ఒకటి ఉంటూనే వుంటుంది. ఓయీ జబ్బు నిచ్చిన వాడేగా ప్రకృతిలో ఔషధాల్ని సమకూర్చింది. చీకటి నిచ్చిన వాడేగా ఆ చీకటిని చీల్చే వెలుగునిచ్చింది. దాహం పుట్టించిన వాడేగా ఆ నిప్పుని ఆర్పే నీటినీ సృష్టించింది. అలాగే, మీరూ నేను ఇక్కడ గుమికూడాము. ఎందుకో తెలీదు.. దేనికో తెలీదు. నిజమే" ఆగారు యజ్ఞప్ప. అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"కానీ, ఇక్కడే ఓ చిత్రం ఉంది. ఓ నవలో, కావ్యమో పురాణమో ఉందనుకోండి. అందులో పాత్రలు ఎన్ని ఉంటాయో, ఎప్పుడు ఏమి చేస్తాయో పాఠకులకి తెలుస్తుందా? రచయితకి మాత్రమే స్పష్టంగా తెలుస్తుంది. అలాగే యీ విశ్వరచన చేసిన మహా స్రష్ట....  ఒకరున్నారు. ఆ స్రష్టకి తెలుసు, ఏ పాత్ర ఎలా వుండాలో, ఎప్పుడు ఎవర్ని ఎలా కలవాలో, కలిసి ఏం చెయ్యాలో మొదలైనవి.

అయ్యా తల్లి గర్భంలో ఉన్నప్పుడు మన తల్లి ఎవరో తండ్రి ఎవరో, మతము కులము ప్రాంతమూ భాషా, దేవుడూ దెయ్యమూ ఇవన్నీ ఏమన్నా మనకు తెలుసా? పుట్టిన తరవాత, అదీ ఎవరో పరిచయం చేస్తేగదా తెలిసింది" మళ్ళీ ఆగారు యజ్ఞప్ప.

"అంతేకాదు.. గంట తరవాతో, రోజు మారిన తరవాతో ఏం జరుగుతుందో మనకి తెలుసా? ఒకరు సెవెన్ స్టేజెస్ ఆఫ్ లైఫ్ అని నిర్వచిస్తే, మరొకరు సప్తజ్ఞాన భూమికలు అని జీవితపు పొరలనించి జ్ఞానపు పొరల్ని విడదీసి విశదీకరించారు. కానీ, జీవితపు రహస్యం తెలిసిన వారెవరూ? తెలిపేవారెవరూ? భారతీయ రుషులూ పాశ్చాత్య సైంటిస్టులూ కూడా శోధనలు సాగించింది ఆ రహస్యం తెలుసుకోవడానికే" మళ్ళీ ఆగారు యజ్ఞప్ప.

మెల్లగా ఓ చల్లని గాలికెరటం ఆ గదిలోకి ప్రవేశించింది. ఆ విషయం గుర్తించింది మాత్రం యజ్ఞప్ప, రామజోగి, పరమేశ్వర శాస్త్రి, మదాలస మాత్రమే.

"అయ్యా.. చాలా ఆలస్యమౌతోంది. వండిన వంటకాలన్నీ చల్లారిపోతున్నాయి. భోజనానికి దయచేస్తే..." భయం భయంగా బిడియంగా అన్నది శ్రీనివాస్ తల్లి. ఓ చిన్న నవ్వు పెదాలపై మెరిసి పకపక శబ్దంగా మారింది యజ్ఞప్పగారి ముఖం మీద. ఆయన నవ్వీ నవ్వీ ఓ నిముషం తరవాత అన్నారు, "అమ్మా..బిడియం ఎందుకు? విశ్వరహస్యాలన్నీ తెలిసినవాడిలాగా ఓ మహా ఉపన్యాసాన్ని దంచుతుంటే, నా అజ్ఞాన ప్రవాహాన్ని ఆపడానికి భగవంతుడు భోజనం మిషమీద నిన్ను పంపించాడు. ధన్యవాదాలు తల్లీ ధన్యవాదాలు" అని కుర్చీలోంచి లేచారు. మిగతా అందరిలోనూ ఓ అసంతృప్తి, తెలుసుకోబోతుండగా మధ్యలో చొరబడిన శ్రీనివాస్ తల్లి మీద కోపం ఉవ్వెత్తున పొంగాయి.

"అసంతృప్తికి చోటివ్వొద్దు మిత్రులారా. తగిన సమయంలోనే తెలియాల్సింది తెలుస్తుంది. నిజంగా భోజనానికి ఆలస్యం అయింది" అంటూ లేచాడు రామజోగి.

ఒకపక్క హిందూకుష్ పర్వతాలు, ఒక పక్క హిమాలయాలు మరో పక్క కారాకోరం సాణువులు.. ఆమధ్యన పుష్పగుచ్ఛంలా ఉంది హుంజావేలీ, భూమిమీది స్వర్గం అది. పాకిస్తాన్‌లో వున్నా అక్కడి 'బోలీ' వేరు. హుంజా వేలి వారి ఆచార వ్యవహారాలు వారికే ప్రత్యేకమైనవి. 50ఏళ్ళు దాటిన మహిళకూడా నవయువతిలా కనిపిస్తుంది. వృద్ధాప్యం దరిదాపులకి రావాలంటే 'వంద' దాటాలి. నూట పదినించి నూట ఇరవైఏళ్ళ వరకూ ఆరోగ్యంగా ప్రజలు బ్రతుకుతారు. భూమి పైని ఇతర ప్రాంతాల్లా వారికి జబ్బులురావు. హార్టెటాక్‌లూ కేన్సర్లూ వారికి తెలీదు. అద్భుతమైన ఆరోగ్యం వారి సొంతం. మనుషుల ఆలోచనలు శ్రేష్టమైనవే. ప్రకృతిలో ప్రకృతిగా వుండటమే వారి దీర్ఘాయుష్షుకి కారణం అంటారు హుంజా వేలిని పరిశోధించినవారు.

ఆ హుంజా లోయలో అతి వృద్ధుడు  ఇసాక్ అల్ హుంజా మీర్. ఆయన భార్య హుస్నా మీర్. ఆయన వయసు 135 సంవత్సరాలు. ఆవిడ వయసు 128. మొత్తం వారి సంతానమూ సంతానానికి సంతానమూ కలిపితే వచ్చే సంఖ్య 143 మంది.

"ఇన్షా అల్లా.. నా మునిమనుమడి సంతానం కోసం ఎదురుచూస్తున్నాం. వాడిని ఎత్తుకున్న 21 వ రోజున మేము తృప్తిగా యీ  హుంజాని వదలి మరో స్వర్గానికి తరలిపోతాం" అన్నాడు  హుంజామీర్. ఆయన సత్ప్రవర్తన కలిగిన ముంజాయీ. ధర్మం తప్పనివాడు. అసయం ఏనాడూ పలుకలేదు.

"అలా ఎలా చెప్పగలరు మీర్ బాబా.. జనన మరణాలు వుండేది అల్లా చేతిలోగదా!" (సం.అ.సం) అన్నాడు.

షాహీ బద్రుద్దీన్ ఖురేషీ. ఖురేషీకి 112 సంవత్సరాలు.

"నాకు తెలుసు షాహీ. నాకు నా పదహారో ఏటనించే తెలుసు. ఒక కల వచ్చేది. ఆ కలలో ఓ మహాబలుడు కనబడేవాడు. నవ్వుతూ నాతో, 'నీ మునిమనవడికి కొడుకుగా పుట్టి నిన్ను అసలైన స్వర్గం చేరుస్తా. అప్పటివరకూ మీరిద్దరూ బ్రతికే ఉండాలి' అనేవాడు. అప్పటినించేకాదు, నా వంశంలో ఏ బిడ్డ పుట్టినా ఆ రోజు రాత్రి కలలో కనపడి మళ్ళీ మళ్ళీ ఇదేమాట చెప్పేవాడు" కలలో కనబడిన ఆ మహాబలుడ్ని చూస్తున్నాడా అన్నట్లు పైకి చూస్తూ అన్నాడు ముంజామీర్.

"ఏ భాషలో  చెప్పేవాడు?"  అడిగాడు ఖురేషీ.

" ఆ భాష ఏదో నాకు తెలీదు. అందుకే ఎవరు యీ లోయలోకి వచ్చినా వారి దగ్గరకు వెళ్ళి మరీ నేను పరచయం చేసుకుంటా. వారి స్వంత భాషలో ఒక్క నిముషమైనా మాట్లాడమని అర్ధిస్తాను. ఇప్పటివరకూ ఎవరూ నా స్వప్న బంధువు మాట్లాడమని అర్ధిస్తాను. ఇప్పటివరకూ ఎవరూ నా స్వప్న బంధువు మాట్లాడలేదు" నిట్టూర్చి అన్నాడు ముంజా మీర్.

"చూద్దాం. ఆ భాష వినేరోజూ రావచ్చు. అల్లా (స.అ.సం) చూపే చిత్రాలు అద్భుతమైనవి" భక్తిగా అన్నాడు బద్రుద్దీన్ ఖురేషీ.

చక్కని టీ వాసన. భారతదేశమేకాదు, భారత సరిహద్దుల్లో వున్న అన్ని దేశాలకీ ప్రియమైనది తేనీరే. వచ్చిన వారిని తేనీరుతో ఆహ్వానించడం ఒకప్పటి అఖండ భారతదేశపు సంస్కృతి. 'చాయ్  అనేది ఎన్ని రకాలంటే, 118 రకాల తేనీరు తయారు చేస్తారు. కొన్ని రకాల 'టీ'లు బ్రాందీ విస్కీలకన్నా ఎక్కువ మత్తునిస్తాయి. కొన్ని ప్రత్యేక తేనీటి రకాల్ని సేవిస్తే 70ఏళ్ళ వయసులో కూడా బిడ్డల్ని పుట్టించవచ్చు అంటారు. ముంజాలోనే దాదాపు 39 రకాల టీలు ఉన్నాయి. వాటి రహస్యం బయటపెట్టరు. అది వారి వారి ఇంటి సీక్రెట్.

బద్రుద్దీన్ నోట్లో ఆవగింజ కూడా దాగదు. అలా అని ఆయన చపల చిత్తుడు కాదు. చాలా సౌమ్యుడు, సత్ప్రవర్తన కలిగినవాడు. గంటలో ఆనోటా యీ నోటా ముంజామీర్ చెప్పినమాట ముంజా లోయ అంతటికీ పాకిపోయింది. ముంజామీర్‌కి వచ్చిన రహస్య స్వప్నం గంటలో బట్టబయలై రెక్కలు విప్పుకుంది.

"రజోవ్‌స్కీ.. ఒక వార్త అందింది. చాలా బయకమ్రమైన వార్త." ఎడ్వర్డ్ డాంట్ అన్నాడు.

"ఏమిటది?" ఉత్సుకతో అడిగాడు స్టిట్సన్.

"కృత్రిమ గర్భాలు కనిపెట్టారు. అది ఓకే. కృత్రిమ అండాలపై చేసిన పరిశోధన సఫలమైనదని వార్త. అది సఫలం అయితే కోటాను కోట్లమంది సైనికుల్ని తయారు చేసి సరైన జీవాణువున్ని ప్రవేశపెడితే పరవాలేదు. పరమక్రూరుల జీవాణువుల్ని బీజాలుగా ప్రవేశపెట్టి పిండాలుగా మారిస్తే?" ఓ క్షణం డాంట్ శరీరం ఒణికిపోయింది.

"అవును...అండమూ బీజమూ కలిస్తేనేగా పిండం తయారయ్యేది. కోటికి ఒక్క క్రూరుడున్నా భూమికి ప్రమాదమే. అలాంటిది లక్షలాది క్రూరుల్ని తయారిస్తే?" షాక్‌తో అన్నాడు గోర్కీ.

"స్టిట్సన్.. ఇది నేను ఊహించినదే. ఎప్పుడైతే మనిషి జీన్స్‌ని పరిశోధించడం మొదలెట్టాడో, అప్పుడే యీ కృత్రిమ పిండాల తయారీకి బీజం పడింది. క్రూరత్వం అనేది ప్రకృతికి ఎన్నటికీ మంచి చేయదు. అణ్వాస్త్రాలతో, రసాయన, క్రిమికీటక ఆయుధాలతో ఇప్పటికీ మనిషి అతలాకుతలా అయిపోతున్నాడు. ఇప్పుడీ కొత్త విపత్తు వచ్చిపడితే భూమండలపు పరిస్థితి ఎలా పరిణమిస్తుందో నా ఊహకే అందడంలేదు. సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు రజోవ్‌స్కీ.

"అహంకారం తలకెక్కితే వచ్చే అనర్థాలు ఒక విధంగా పరిణమిస్తే, యీ సరికొత్త 'తెలివిడి' వల్ల వచ్చే అనర్థాల పరిణామం ఎవరి వూహకీ అందనిది. సృష్టించిన వాడి మేధకే అందదు. తను సృష్టించిన విజ్ఞాన ఫలం ఎంత విషపూరితమైనదో" తలపట్టుకుని అన్నాడు స్టిట్సన్. వారు నలుగురూ కూర్చున్నది న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో. ఇప్పుడైతే లక్షాతొంభై స్టార్ హోటల్స్ వచ్చాయి. ఒకప్పుడు విదేశీయ నాయకులకి ఆవాసం అశోకానే.

వారు న్యూఢిల్లీకి రావడానికి కారణం గోర్కీనే. గోర్కీ స్నేహితుడు 'ది సిటీ అబ్జర్వర్'ఫౌండర్ ఎడిటర్ సచేత్ దద్లాని ఫ్రెండ్ కావడడమే. గోర్కీకి సచేత్ 'తపతి' విశేషాలు చెప్పడంతో, గోర్కీ తన అంతర్జాతీయ సహచరుల్ని అర్జంటుగా ఇండియా రప్పించాడు.

"మనం రేపు ఉదయమే సూరత్ వెడదాం. నా ఫ్రెండ్ సచేత్ దద్లానీని మాత్రమే కాక తని కరస్పాండెంట్స్ అందర్నీ కలుద్దాం. తపతీనది వద్ద జరిగిన పశువుల మృతి గురించి మాత్రమేగాక ఇండియాలో జరుగుతున్న అనేకానేక విషయాల గురించి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరాతీద్దాం. ఇప్పటికే నల్లమల అడవుల్లోని శిథిలాలయం గురించీ, తక్షపురంలోని సర్పశిల గురించీ, నివృత్తి యజ్ఞం గురించీ, అమెరికాలో పుట్టినా ఇండియన్‌లా చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్న రాబీ వెబ్‌స్టర్

గురించీ మన దగ్గర సమాచారం ఉంది. ఈ సమాచారం విషయాన్ని తెలుసుకోవడం వరకే పనికొస్తుంది. అసలు పరిస్థితుని కరెక్టుగా అంచనా వెయ్యాలంటే, మనకి వ్యక్తుల్ని కలిసి మాట్లాడటమే సరైన పద్ధతి." స్థిరంగా అన్నాడు గోర్కీ.

"యస్.. అదే కరెక్టు. సమాచారం ఊకలాంటిది. దాన్ని తూర్పార బడితే మిగిలేది ఎంతో తెలిసేది వ్యక్తుల్ని కలిశాకే" గోర్కీని సమర్థిస్తూ అన్నాడు రజోవ్‌స్కీ.

"యస్.. అంతేకాదు .కొన్ని నగరాల్లో అవాంఛనీయ సంఘటనలూ, అవాంఛనీయ హింసా ప్రబలుతున్నాయి. వాటి వెనకాల ఏముందో అదీ తెలుసుకోవాలి. నిజానికి మన పరిస్థితి ఏమంటే అర్ధరాత్రి పరమ చీకట్లో, గడ్డివాములో పడిన గుండు సూదిని వెదకటంలాంటిది. ఎటునించి ప్రారంభించినా, గమ్యం చేరి తీరాలి. అందుకే అన్నిట్నీ జల్లెడ పట్టి విశ్లేషిస్తేనే ఏదో ఓ లీడ్ దొరుకుతుంది" గట్టిగా నిట్టూర్చి అన్నాడు స్టిట్సన్. అవునన్నట్టు తలవూపాడు ఎడ్వర్ట్ డాంటే.

"ఒక రాక్షసుడు ఉన్నాడు. వాడి ప్రత్యేకత ఏమిటంటే వాడి ఒంట్లోనించి ఒక్క రక్తపు బొట్టు రాలిపడినా, ఆ బొట్టులోంచి అతని వంటివరే, అతని వయసూ అతని మనసూ కలిగిన క్రూరులే వెయ్యిమంది క్షణంలో జన్మిస్తారట. ఒకడ్ని భరించడమే లోకానికి ప్రాణగండం అయినప్పుడు వెయ్యిమందిని ఎలా భరించడం? సపోజ్ పది బొట్ల రక్తం నేలనపడితే పదివేలమంది క్రూరులు పుట్టుకొస్తారు" ఆగాడు గోర్కీ.

"కథ బాగుంది!" నవ్వాడు స్టిట్సన్.

"ఒక ఛానల్‌లో పెట్టిన ఓ సినిమా సిడి వెయ్యి లక్షల ఇళ్ళల్లో ఒకేసారి ఆన్ చెయ్యొచ్చనీ ఆ సినిమాని అందరూ కూర్చుని చక్కగా చూడొచ్చనీ ఓ యాభై ఏళ్ళ క్రిత్మ చెబితే, అప్పటివాళ్ళు కూడా నీలాగే, 'కథ బాగుంది ' అనే వాళ్ళు స్టిట్సన్. అలాగే చేతిలో ఫోన్ పెట్టుకుని క్షనాల్లో ప్రపంచంలోని ఏదేశంలో వుండే వారితోనైనా మాట్లాడొచ్చు, మెసేజ్ పెట్టొచ్చు, ఫోటోలూ డాక్యుమెంట్లూ పంపొచ్చు, రిసీవ్ కూడా చేసుకోవచ్చు అని 30 ఏళ్ళముందు ఎవqరన్నా వాళ్ళు కూడా 'కథ చాలా బాగుంది ' అనేవారు. మన కళ్ళెదుట ఉన్నది ఏమిటో తెలుసా, ఒకప్పటి మనిషి ఊహించలేనిది. అల్బర్ట్ ఐన్ స్టయిన్ ఏమన్నారూ? 'ఇమాజినేషన్ యీజ్ గ్రేటర్ దాన్ నాలెడ్జ్" అని.

అలాగే నా పూర్వీకులు రాసిన మహిషాసుర వధ ఊహే కావొచ్చు. కానీ అటువంటి పరిస్థితి ఏర్పడినప్పుడు, ఆ విషమ పరిస్థితినించి ఎలా మనని మనం కాపాడుకోవాలో కూడా స్పష్టంగా తెలియజేయబడ్డది. ఆ రాక్షసుడి పేరు రక్తబీజుడు. వాడీ రాజు పేరే మహిషాసురుడు. ఇందాక మనం మాట్లాడూకున్న కృత్రిమ గర్భాశయాల, కృత్రిమ అండాలు మనిషి విధ్వంసానికి ఉపయోగపడితే, దానినుంచి ఎలా బయటపడాలో రక్తబీజుడి కథ వివరిస్తుంది. సామాన్యులకి అర్ధంకావడానికే సైన్సుని కథారూపంలో చెప్పారు మా మహర్షులు అనబడే సైంటిస్టులు" తీవ్రంగానే స్టిట్సన్‌తో అన్నాడు గోర్కీ.

"ఒకె ఒకె సారీ..." సారీ చెప్పాడు స్టిట్సన్.

"అంతేకాదు.. ప్రతిదేశానికీ గతమూ వర్తమానమూ రెండూ వుంటాయి. వారికుండే పూజ్య గ్రంథాలు, శాస్త్రాలూ, ఆయుధాలు, ఆహార విహారాలు వారి పథతిలో వుంటాయి. ఆనాటి కొన్ని విషయాలు యీనాటి దృష్టితో చూడకూడదు. ఉదాహరణకి మీ 'నోవాస్ ఆర్క్ ' ఉంది. ప్రళయం రాబోతున్నట్టు, ఒక ఆడ ఒక మగ చొప్పున సర్వజీవుల జంటల్నీ ఆ ఓడలోకి చేర్చమన్నట్లు మీ గ్రంథాల్లో వుంది. ఇదే విషయం మాకూ ఉంది. మునువు అనే రాజు స్నానం చేస్తుంటే దోసిలిలోకి ఓ చేపవచ్చి, 'రాజా నన్ను చెరువులో పడెయ్యి' అన్నది. క్షణాల్లో చెరువంత అయింది. అప్పుడా చేప నన్ను సముద్రంలో పడెయ్యి అన్నది. ఆ రాజు ఆ చేపని సముద్రంలో పడేశాడు. అప్పుడా చేప విపరీతంగా పెరిగి మీ దేవదూత చెప్పినట్లే లోకంలోని జీవరకాల్లో ఒక ఆడ ఒక మగ చొప్పున వీపు మీదకి చేర్చమన్నది. రాజు అలాగే చేశాడు. ఓ మహాప్రళయం వచ్చి సర్వమూ నీటిలో మునిగి పోయింది. చేపమాత్రమూ నీటిలో తేలుతూ జీవరాశుల్ని రక్షించింది. రెండు దేశాల్లోని కథలకంటెంటూ ఒకటే. అయితే హోరెత్తిన సంద్రంలో ఓడ మునిగిపోవచ్చు. కానీ నీటిమీది చేప మునగదుగా. అలా లా పాయింట్లు తీసి చర్చిస్తే ఏ కథ సత్యానికి దగ్గరగా వస్తుందీ? మైడియర్ స్టిట్సన్, అవి కట్టుకథలు కాదు. సముద్రాలన్నీ ఒకేసారి పొంగి భూమిని ముంచేస్తే భూమిమీద జీవుల్ని ఎలా రక్షించాలీ అనే ఓ అద్భుతమైన, ఆచరణయోగ్యమైన ఆలోచన. నోవాస్ ఆర్క్ అంటే సముద్రం మీద తేలే నావ, ఓడ కావక్కర్లేదు. సముద్ర జలాల్లో పలచరించగలిగే సబ్‌మెరీన్ కూడా కావొచ్చుగా. అలాగే చేపకూడా, మామూలు చేప కాక సబ్‌మెరైన్ రూపంలో వుండే చేప కావొచ్చుగా! Let's try to learn some thing insted of criticizing" అంటూ తన సుదీర్ఘ స్పీచ్‌ని ముగించాడు గోర్కీ.

"యస్.. నీ పాజిటివ్ థింకింగ్ మాత్రం అద్భుతం" గోర్కీతో కరచాలనం చేశారు స్టిట్సన్ డాంట్, రజోవ్‌స్కీ.

"సరే అయితే. ఓ పెద్ద సమావేశం జరగాలి. అది ఎక్కడో సూరత్ వెళ్ళాక నిర్ణయించుకుందాం. ప్రస్తుతం మనకు సమాచారంలో తగిలిన వారందర్నీ ఒకచోటికి చేర్చే ప్రయత్నం చెయ్యాలి. మరో ముఖ్యమైన విషయం మహాభారతంనాటి ఆయుధాల వ్యవహారం. యుద్ధం జరిగింది కురుక్షేత్రంలో పద్దెనిమిది, అక్షౌహిణీలు సైన్యం. వారందరి ఆయుధాలు పోగు చెయ్యాలంటే అసలు సాధ్యమేనా? ఎన్ని కత్తులు, ఎన్ని డాలులు, ఎన్ని శిరస్త్రాణాలు, ఎన్ని కవచాలు, ఎన్ని బల్లాలు, ఎన్ని త్రిశూలాలు, ఎన్ని గొడ్డళ్ళు..ఓహ్... తలచుకుంటేనే పిచ్చెక్కుతుంది. అదీగాక సైనికాధికారుల కిరీటాలు నగలు ఓహ్.. ఇవన్నీ ఎవరు పోగు చేశారు. ఎక్కడ జాగ్రత్త పెట్టారు. ఎందుకు వాటిని గుప్తంగా దాచారు. అసలు వాటన్నిట్నీ పోగుచేయడం ఎలా సాధ్యపడింది. ఇప్పుడు అవన్నీ ఎక్కడున్నాయి. ఇవన్నీ ప్రశ్నలే. జవాబులు కనుక్కుని తీరాల్సిన ప్రశ్నలే. మన మోస్ట్ మోడరన్ సెర్చ్ శాటిలైట్స్ వాటిని ఎందుకు పసిగట్టలేకపోతున్నాయి. ఒకవేళ వాటిని గుప్తంగా ఎవరైనా దాస్తే, అలా గుప్తంగా దాచడానికి కారణం ఏమిటి? అవి అప్పటివి. అప్పటికీ ఇప్పటికీ కనీసం అయిదు వేలనించి ఏడువేల సంవత్సరాలు అవుతుంది. ఏడువేల సంవత్సరాలపాటు యీ రహస్యాన్ని ఎలా దాచిపెట్టారు. ఆ రహస్యం

తెలిసినవారు ఎవరైనా బ్రతికివున్నారా?" వరసగా తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా ఓ ఉద్వేగంతో అన్నాడు గోర్కి. అందరూ అవాక్కయ్యారు.

"యస్ మిస్టర్ గోర్కి. మీరన్న ఏ ప్రశ్ననీ వదిలిపెట్టకూడదు. మీరో ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ని నిర్ణయించండి. వీలయినంత తొందరగా" సుదీర్ఘంగా నిశ్వసించి అన్నాడు ఎడ్వర్ట్ డాంట్.

"నాక్కొంచెం ఓడ్కా తాగాలనుంది. అదీ ప్యూర్ ఇండియన్ ఓడ్కా" చర్చని దారి మళ్ళించడానికి అన్నా సిన్సియర్‌గానే అన్నాడు రాజోవ్‌స్కీ. నవ్వాడు గోర్కి.

"యా.. ఐవిల్ ఆర్డర్ ద బెస్ట్ ఇండియన్ డ్రింక్స్ ఎండ్ ఫుడ్" నవ్వుతూనే వెయిటర్‌ని పిలిచాడు గోర్కి.

"ఒక సభ జరగాలి దాదాపు లక్షమంది ఆ సభకు హాజరవ్వాలి అంటే, ముందు ఏం చెయ్యాలి?" పరమేశ్వర శాస్త్రిగారు అడిగారు శ్రీనివాస్‌ని.

"అంతమంది పట్టే చోటు చూడాలి."

"ఇంకా?"

"అంతమందికి వసతి, నీరు పుష్కలంగా లభిస్తాయా? ఆహారం సమకూర్చాలంటే తగిన అవకాశాలు ఉంటాయా లేవా? సరుకులు సిద్ధంచేసినా వంటవారు దొరుకుతార లేదా, ఈ సామాగ్రి అంతా చేరవేయడానికి తగిన వాహనదారులూ, వాహనాలూ మనకి దొరుకుతాయా లేదా వంటి విషయాలు అన్నీ చక్కగా ఆలోచించుకోవాలి" జవాబిచ్చాడు శ్రీనివాస్, "కాలకృత్యాలకి కూడా ఏర్పాట్లు చూడాలి."

"ఇంకా?" చిన్నగా నవ్వి అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"వైద్యుల్ని ఏర్పాటు చేసుకోవాలి. అందరికీ పనికొచ్చే మందుల్ని సమకూర్చుకోవాలి. ఒక్కోసారి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడవచ్చు. వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. పురుగూ పుట్రా గురించి కూడా సంసిద్ధంగా వుండాలి" కొంచెం ఆలోచించి అన్నాడు శ్రీనివాస్.

"మంచిది. ఓ సభ కోసమే ఇన్ని విషయాలు ఆలోచించాం. ఆహారానికీ, దాహానికీ కావాల్సినవన్నీ సేకరించి చేర్చిపెట్టుకోవాలి. స్థలం చూశాక దాన్ని చక్కగా చదునుచేసి, ఆహూతులు కూర్చొనడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలి. శ్రీనివాసా, ఓ లక్షమంది ఉండే సభకే ఇన్ని ఏర్పాట్లు అవసరమైతే, కోటానుకోట్ల జీవరాసులు నిత్యం తమ జీవనాన్ని సాగించడం కోసం భగవంతుడు ఎన్ని ఏర్పాట్లు చేయాలంటావూ? మానవుడు గాలినీ, నీటినీ, నేలనీ, నిప్పునీ కూడా అమ్ముకుంటున్నాడు. ఇవన్నీ మానవుడు సృష్టించినవి కాదు. దేవుడు సృష్టించినవి" ఆగారు శాస్త్రిగారు.

"అవును" అన్నాడు శ్రీనివాస్.

"అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్టు, భగవంతుడు సృష్టించిన సర్వాన్నీ అంటే పంచభూతాలనేకాదు, వాటిలో తయారైన సర్వాన్నీ మనిషి అమ్ముకుంటున్నాడు. కేవలం తన స్వార్ధం కోసం వినియోగించుకుంటున్నాడు" నిట్టూర్చి అన్నారు శాస్త్రిగారు.

"మొత్తాన్నీ అమ్మటానికి పనికిరాకుండా చెయ్యొచ్చుగా?" అడిగాడు శ్రీనివాస్.

"అప్పుడు దెబ్బతినేది బలవంతులూ, క్రూరులూ వ్యాపారస్తులూ అధికారులూ కాదు. దెబ్బతినేది సామాన్య మానవులు. ప్రకృతిని ప్రేమించి ప్రకృతి బిక్షను ప్రేమగా అందుకునే సామాన్యులు. ఒక మంచి వాడికోసం వెయ్యిమంది వెధవలనైనా వదిలెయ్యడం. భగవంతుడి న్యాయం. కేవలం తనకోసం లక్షమంది నోరు కొట్టడం స్వార్ధపరుల న్యాయం." చెప్పారు శాస్త్రిగారు.

"శాస్త్రిగారూ... అసలీ సృష్టి అంతా చేసినది దేవుడేనంటారా?" ఇబ్బంది పడుతూ అడిగాడు శ్రీనివాస్. పకపకా నవ్వారు శాస్త్రిగారు.

"బాబూ, యీ సృష్టిలో నువ్వు సృష్టించింది ఏమైనా ఉందా? అత్యంత మేధావులూ సైంటిస్టులూ కూడా ఒక చిన్న పరమాణువునైనా సృష్టించలేరు. కానీ సృష్టిలో ఆల్‌రెడీ వున్న దాని రూపుని మాత్రం కొంత మార్చగలరు. 'Atom can neither be created nor destroyed. But, if can be converted" అనే డాల్టన్ అటామిన్ థియరీ చదువు. ఇది నేను చెప్పేమాట కాదు. ఆటమ్ నే ఆంత అనుకుంటే, ఆత్మని సృష్టించలేము. అది నీటిలో మునగదు నిప్పుతో కాల్చబడదు అనే భగవద్గీతా వాక్యం కూడా విన్నావుగా. ఈ అనంత సృష్టినీ ప్రకృతినీ ఎవరు సృష్టించినా, సర్వంలోనూ ఓ చైతన్యం ఉండటం సత్యమేకదా! ఆ సత్యానికే భగవంతుడు, శక్తి, చైతన్యం, ఆత్మ ఏ పేరైనా పెట్టుకో. నీటిని నీరు, జలము, వాటర్, పానీ, వెళ్ళం, తన్ని ఇలా లక్షభాషల్లో, లక్ష పేర్లు పెట్టుకోవచ్చు. కానీ నీరు అదేగా! అలాగే ఆ చైతన్యాన్ని లక్ష పేర్లతో పిలుచుకోవచ్చు. శక్తి మాత్రం అదేగా!" చిన్నగా నవ్వి వివరించారు శాస్త్రిగారు. శ్రద్ధగా వింటున్నాడు శ్రీనివాస్. శరద్వతి కూడా వింటోంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments